క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడికి నివాళి



తిరుపతిరెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా, పార్టీ నాయకులు

తర్లుపాడు: మండలంలోని బుడ్డపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు అల్లు తిరుపతిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైయస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆదివారం నివాళులర్పించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం మృతి చెందారు. కుమారుడు వెంకటరెడ్డిని ఓదార్చిన అన్నా రాంబాబు పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. స్థానిక సర్పంచ్ పెద్దమస్తాన్, వైస్ సర్పంచ్ పార్వతి బ్రహ్మారెడ్డి, వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ జవ్వాజి భాస్కర్, పార్టీ నాయకులు కొలగొట్ల పెద్ద వెంకటరెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

గిద్దలూరు రూరల్: ఆటో, బైక్ ఢీకొనడంతో ముగ్గురికి స్వల్ప గాయాలైన సంఘటన మండలంలోని నరవ రోడ్డులో సీతారామకల్యాణ మండపం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. గిద్దలూరు నుంచి బైక్‌పై వెళ్తున్న వారిని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. రాజుపాలేనికి చెందిన ఆటో డ్రైవర్ వెంకటరమణతో పాటు బైక్‌పై ఉన్న వారికి స్వల్ప గాయాలు కాగా స్థానికులు స్పందించి గిద్దలూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

బదిలీ అయిన పోలీస్ సిబ్బందికి సన్మానం



పొదిలి: స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పలు ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న పోలీసు సిబ్బందిని ఆదివారం తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏ ప్రాంతంలో పని చేస్తున్నా క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే మంచిపేరు వస్తుందన్నారు. బదిలీపై వెళ్తున్న సిబ్బంది సేవలను ఎస్సై వేమన కొనియాడారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ పూర్ణ, కానిస్టేబుళ్లు బాల మురళి, అమీర్‌వలి, భరత్‌ను ఘనంగా సన్మానించారు.

భూసారాన్ని కాపాడుకుందాం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మార్కాపురం: భూమిపై ప్రాణకోటి మనుగడకు చిత్తడి నేల ముఖ్యమని జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కోఆర్డినేటర్ ఎం.సజీవరాజు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో అవగాహన సదస్సు నిర్వహించారు. నీటి వనరులకు, మంచినీటికి మూలాలుగా ఉన్న చిత్తడి నేలలు భూమి ఉపరితలం నుంచి వ్యర్థాలను వడపోస్తాయన్నారు. నీటి నాణ్యతను పెంచడంలో కాలుష్య కారకాలను తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ రవిశేఖర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నబీ, అక్కల నారాయణ, వైవీరావు తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



మార్కాపురం: మార్కాపురం రైల్వే స్టేషన్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణారెడ్డి కథనం మేరకు.. స్టేషన్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్ ఎదురుగా గల ప్లాట్‌ఫాంపై నిల్చున్న ఆ యువకుడు.. కాసేపటి తర్వాత గూడ్స్ రైలు రాకను గమనించి పట్టాలపైకి దూకాడు. గూడ్స్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుందని, ఎర్ర రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ రాదండి.. ఆటోలే దిక్కండి!



- తర్లుపాడు మండలంలోని 15 గ్రామాలకు తిరగని ఆర్టీసీ బస్సులు
- ప్రజలతోపాటు వందలాది మంది విద్యార్థులకు ఆటోలే దిక్కు
- బస్సులు తిప్పే అవకాశం ఉన్నా ఆ దిశగా ఆలోచించని అధికారులు

తర్లుపాడు:

డివిజన్ కేంద్రం, నియోజకవర్గ కేంద్రమైన మార్కాపురానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న తర్లుపాడు మండలంలోని సుమారు 15 గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదకరమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోల్లోనే మార్కాపురానికి వస్తున్నారు. ఆర్టీసీ బస్సుల సౌకర్యం మండల కేంద్రమైన తర్లుపాడుకు, తర్లుపాడు మీదుగా తాడివారిపల్లి, మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా కనిగిరికి ఉంది. తద్వారా మార్కాపురం–తర్లుపాడు మధ్యలో ఉన్న సీతానాగులవరం, మీర్జాపేట, నాగెళ్లముడుపు, తాడివారిపల్లి గ్రామాల ప్రజలు మాత్రమే బస్సు ఎక్కగలుగుతున్నారు. అప్పటికీ ఆయా గ్రామాల నుంచి ఉదయం పూట మార్కాపురం చేరుకోవాలంటే ఆటోల్లో రావాల్సిందే. తర్లుపాడు మండలంలోని 16 పంచాయతీల్లో 21 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలతోపాటు మార్కాపురంలో చదువుకుంటున్న సుమారు 500 మందికి పైగా విద్యార్థులు అటు తర్లుపాడు, ఇటు మార్కాపురం వెళ్లేందుకు ఆటోలే దిక్కయ్యాయి.

బస్సు లేనిది ఈ గ్రామాలకే..

స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలైనా తర్లుపాడు మండలంలోని పలు గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్సు తిరగడం లేదు. ప్రభుత్వాలు పల్లె వెలుగులు ఏర్పాటు చేసినా అవి కొన్ని మండలాలకే పరిమితమయ్యాయి. వెనుకబడిన తర్లుపాడు మండలంపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ప్రగతికి రథ చక్రాలు ఆర్టీసీ బస్సులు అంటూ గొప్పగా ప్రచారం చేస్తున్నా పల్లెలకు మాత్రం ఇప్పటికీ బస్సులు తిప్పడం లేదు. పోతలపాడు, గానుగపెంట, మంగళకుంట, కొత్తూరు, ఓబాయపల్లె, కొండారెడ్డిపల్లి, జగన్నాథపురం, తుమ్మలచెరువు, బుడ్డపల్లి, సూరేపల్లి, కేతగుడిపి తదితర గ్రామాల్లో ఇప్పటికీ ఆర్టీసీ అడుగు పెట్టలేదు. ఆయా గ్రామాల ప్రజలు ఆటోల్లోనే రాకపోకలు కొనసాగిస్తున్నారు. గర్భిణులు సైతం కాన్పు సమయంలో ప్రమాదకరమని తెలిసినా గత్యంతరం లేక ఆటోల్లోనే వస్తుంటారు. మండల కేంద్రమైన తర్లుపాడులో ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీసుస్టేషన్, వ్యవసాయశాఖ, వెలుగు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వచ్చేవారు సొంత వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు.



తర్లుపాడు బస్టాండు

ఇలా బస్సులు నడపొచ్చు

- మార్కాపురం నుంచి గానుగపెంట, పోతలపాడు మీదుగా దొనకొండ వరకు బస్సు నడిపే అవకాశం ఉంది.
- మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా కంభం పట్టణానికి షటిల్ సర్వీస్ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.
- మార్కాపురం నుంచి తుమ్మలచెరువు, తర్లుపాడు మీదుగా పొదిలి వరకు బస్సు నడిపితే 6 గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.
- కంభం నుంచి తర్లుపాడు మీదుగా పొదిలి వరకు బస్సులు నడపాలనేది మండల ప్రజల చిరకాల కోరిక.

దొనకొండ వరకు బస్సు నడపాలి



మార్కాపురం నుంచి రాయవరం, గానుగపెంట, పోతలపాడు మీదుగా దొనకొండ వరకు బస్సులు నడిపితే ప్రయోజనకరంగా ఉంటుంది. చదువుకునే విద్యార్థులు, ఇతర పనుల నిమిత్తం వేళ్లే ప్రజలకు సౌకర్యంగా కూడా ఉంటుంది.

– బాలయ్య, గానుగపెంట

మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేదు



మండల కేంద్రమైన తర్లుపాడుకు వెళ్లేందుకు తుమ్మలచెరువు నుంచి బస్సు సౌకర్యం లేదు. కనీసం ఆటో సౌకర్యం కూడా లేదు. వివిధ పనుల నిమిత్తం తర్లుపాడుకు సొంత వాహనాల్లో వెళ్తున్నాం. సొంత వాహనాలు లేనివారు నడిచి వెళ్లాల్సిన దుస్థితి. మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా పొదిలి వరకు బస్సు ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా సులువుగా వెళ్లే అవకాశం ఉంటుంది.

– అబ్దుల్ పఠాన్, తుమ్మలచెరువు

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం



ఆర్టీసీ బస్సు సౌకర్యం విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెడచెవిన పెడుతున్నారు. నేటికీ మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. సచివాలయం ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

– అక్బర్ అలీ, కోఆప్షన్ సభ్యుడు

5న వైఎస్సార్ సీపీ ఫీజు పోరుబాట

- పార్టీ శ్రేణులు తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన నాయకులు

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు వెంటనే విడుదల చేయాలని మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఈనెల 5న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ఫీజు పోరు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద చెల్లించాల్సిన 3,900 కోట్లను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్ 2 అంజమ్మ శ్రీనివాసులు, రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి పత్తి రవిచంద్ర, కొనకనమిట్ల ఎంపీపీ మురళీకృష్ణ యాదవ్, శంకర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, నాలి రజని, నాయకులు బట్టగిరి తిరుపతిరెడ్డి, లయోల చెంచిరెడ్డి, మందటి మహేశ్వరరెడ్డి, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు ఎం.శ్రీనివాసులు, చదలవాడ రమణారెడ్డి, కరీముల్లా, భూపని కాశయ్య, రఫీ, నాలి కొండయ్య, పీపీ నాయుడు, సుంకన్న, ఉస్మాన్, కొండయ్య, నాగబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయండి



అన్నా రాంబాబు, కృష్ణచైతన్యను సన్మానిస్తున్న ఉత్తమ్, తదితరులు

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఆ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ క్రిస్టియన్, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన ఉత్తమ్‌కుమార్ ఆదివారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి అన్నా రాంబాబు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపి రాంబాబు, ఆయన కుమారుడు కృష్ణచైతన్యను సత్కరించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బూదాల సతీష్, మురారి వెంకటేశ్వర్లు, దర్శి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు రమణ, ఎబినేజర్, పవన్, రత్నం, కిశోర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మార్కాపురంలో రథసప్తమి వేడుకలు

- సప్తవాహనాలపై చెన్నకేశవుని దర్శనం



మార్కాపురం టౌన్: మార్కాపురంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారికి ఈనెల 4న వైభవంగా రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా ఒకే రోజు స్వామివారు సప్త వాహనాలపై వివిధ వాహనాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఉదయం గం.5.30 నుంచి 7 గంటల వరకు సూర్యప్రభ వాహనం, 9 నుంచి 10 గంటల వరకు శేష వాహనం, 11 నుంచి 12 గంటలకు గరుడ వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనం, 2 నుంచి 3 వరకు చక్రస్నానం, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు రజిత రథోత్సవం (వెండి రథం), రాత్రి 8 నుంచి 10 గంటలకు చంద్రప్రభ వాహనాల్లో స్వామివారు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. ప్రతి వాహనం వెంట సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు రథసప్తమి వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, అల్పాహార ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

చోరీలు, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

- ఎస్పీ దామోదర్



బేస్తవారిపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్



టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐజీ త్రిపాఠి, ఎస్పీ దామోదర్

కంభం: చోరీల నివారణకు పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారని, ప్రజలు కూడా స్వయంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని సహకరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కంభం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిబ్బంది క్వార్టర్స్, కేసుల రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్క నాటారు. కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, కంభం, గిద్దలూరు సీఐలు కె.మల్లికార్జున, రామకోటయ్య, ఎస్సై నరసింహారావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలి

బేస్తవారిపేట: సీసీ కెమెరాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయడం ద్వారా నేరాలు జరిగినప్పుడు ఉపయోగపడతాయన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకునేలా వాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాత్రి పూట గస్తీని ముమ్మరం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ వి.నాగరాజు, సీఐ మల్లికార్జున, ఎస్సైలు ఎస్‌వీ రవీంద్రారెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరికి ఐజీ, ఎస్పీ ఘననివాళి

మార్కాపురం: జిల్లా అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ దామోదర్, డీఎస్పీ నాగరాజు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా 56వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు ఘనంగా నివాళులర్పించారు. మార్కాపురం, కంభం, యర్రగొండపాలెం, గిద్దలూరు సీఐలు సుబ్బారావు, మల్లిఖార్జున్, ప్రభాకర్, సురేష్, రామకోటయ్య పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

మొక్కజొన్న లోడ్ లారీ బోల్తా



వాగులో బోల్తా పడిన లారీ

అర్ధవీడు: మండలంలోని పాపినేనిపల్లి వద్ద చీమలేరు వాగులో శనివారం రాత్రి మొక్కజొన్న లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తాపడింది. పెద్దకందుకూరు, అంకభూపాలెం పంట పొలాల్లో నుంచి మొక్కజొన్న కంకులు లోడ్ చేసుకుని తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. లారీలో నలుగురు వ్యక్తులు ఉండగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



పోలేరమ్మ తల్లి



కోటసత్యమాంబ

బేస్తవారిపేట: మండలంలోని గొట్టిముండ్ల సమీపంలోని కోటసత్యమాంబ దేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారిని అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని పుట్ట, నాగశిలలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న రమణయ్య

పొదిలి: బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఒంగోలు–నంద్యాల రోడ్డులోని కాటూరివారిపాలెం గ్రామంలో బాప్టిస్టపాలెం సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన దొండపాటి గాలెయ్య మర్రిపూడి మండలం చిమట గ్రామంలో పచ్చాకు కూలీ పనులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మక్కెనవారిపాలెం నుంచి మోటారు సైకిల్‌పై చిమట వెళ్తున్నాడు. మార్గమధ్యంలో రైల్వే బ్రిడ్జి వద్ద కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన పువ్వాడి రమణయ్య బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన రమణయ్యను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏఎస్సై సత్యనారాయణ వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించారు.

క్విజ్ విజేతలకు బహుమతులు పంపిణీ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శ్రీ ఫ్రెండ్స్ సభ్యులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శ్రీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను పాఠశాల హెచ్‌ఎం యం చంద్రశేఖర్‌రెడ్డి, నిర్వాహకులు నబీ, వెంకటేశ్వరరెడ్డి, శివప్రసాద్‌లు ఆదివారం ప్రారంభించారు. గణితం, సైన్సు అంశాలపై జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మొత్తం 26 టీములు పాల్గొన్నాయి. విజేతలకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందించారు. మొదటి బహుమతి రూ.7 వేలను టంగుటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వెంకట భార్గవి, అపర్ణ, నిహారిక, హరిప్రియ కైవసం చేసుకున్నారు. ద్వితీయ బహుమతి రూ.5 వేలను దోర్నాల మండలం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎస్ఎండీ మాజ్, నిశాంత్, నాగవంశీ మాధవ్, రిహాన్, అలాగే తృతీయ బహుమతి రూ.3 వేలను మార్కాపురం జెడ్పీ బాయ్స్ విద్యార్థులు రాకేష్, ప్రసాద్, భానుసాకేత్, మోహిత్, ఫణీంద్ర గెలుపొందారు. కార్యక్రమంలో శ్రీ ఫెండ్స్ సభ్యులు యామా లక్ష్మి, శ్రీనివాసులు, కనకదుర్గ, కృష్ణవేణి, ఎం.శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.